క్లుప్తంగా

ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి



విద్యార్థులకు జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్

బోట్‌క్లబ్: ఈ నెల 15వ తేదీన ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. అజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా నిర్వహించాలన్నారు. స్థానిక జగన్నాథపురం ఎంఎస్ఎన్ జూనియర్ కళాశాలలో మంగళవారం సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ఈ దేశ వాసులుగా మనమంతా దేశం కోసం కలసిమెలసి జీవించాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఎస్ఎస్ చార్టీస్ ప్రిన్సిపాల్ బాబూరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి పాల్గొన్నారు.

14న ప్రైమ్ మినిస్టర్ మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 14వ తేదీన ప్రైమ్ మినిస్టర్ అప్రెంటీస్ మేళా–2023 నిర్వహిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడతో పాటు కొనసీమ, తూర్పుగోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న వివిధ కంపెనీల్లో అప్రెంటిస్‌షిప్‌లను భర్తీ చేయనున్నామని, ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 63038 75609 నెంబరుకు సంప్రదించవచ్చన్నారు.

15న యాతగిరికి మధ్వ పురస్కారం

బోట్‌క్లబ్: ఆంధ్ర మధ్వ సమాఖ్య కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15న రాజమహేంద్రవరం మల్లిగ సత్రంలో మధ్వమత ప్రచారకర్త యాతగిరి పరశురామ్‌ను సత్కరిస్తున్నట్లు కమిటీ కార్యదర్శి కందాళం నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 ఏళ్లుగా యాతగిరి మధ్వ పంచాంగం పేరిట ప్రతి సంవత్సరం మధ్వ పంచాంగాన్ని దేశ వ్యాప్తంగా ఉన్న మధ్వసభ సభ్యులకు ఉచితంగా అందజేస్తున్నారన్నారు.

వైద్య శిబిరంలో పరీక్షలు

కాకినాడ రూరల్: సర్పవరం జయంతినగర్ అంబేద్కర్ పార్కు వద్ద మంగళవారం కేలంగి సుబ్బారావు సేవా సంస్థ చైర్మన్ రెవరెండ్ కె.డేవిడ్ లివింగ్ స్టన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించి సుమారు 300 మందికి వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని పాస్టర్స్ ఫెలోషిప్, ఏబీసీ నాయకులు జోసఫ్ బెన్నీ, రిక్కి గూటం, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, గ్రామ నాయకుడు పుల్ల చందు తదితరులు ప్రారంభించారు. శిబిరంలో ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు విజయదుర్గాదేవి, సురేశ్వర్, కార్తీక్, సిబ్బంది వైద్య సేవలందించి, ఉచితంగా మందులు అందజేశారు. సలోమీ, యూత్ సభ్యులు దీవెన్, షాన్, ప్రిన్స్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అవసరం

కాకినాడ సిటీ: పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీ సమావేశం డీఎంహెచ్‌వో ఆర్.రమేష్ అధ్యక్షతన కలెక్టరేట్ కోర్టు హాలులో నిర్వహించారు. వాతావరణంలోని మార్పులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించడం, సురక్షితమైన ఆహారం, నీరు, గాలి, నిత్యం సమాజంలో మానవునికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల సమన్వయంతో జిల్లా కమిటీ పని చేయాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు జి.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, వినీల, బి.రవి పాల్గొన్నారు.

సర్పవరం సబ్ రిజిస్ట్రార్‌గా రమేష్

కాకినాడ లీగల్: సర్పవరం సబ్ రిజిస్ట్రార్‌గా డిప్యూటేషన్ పై సి.రమేష్‌ను నియమిస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఏలూరు డీఐజీ అబ్రహం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మామిడికుదురులో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ రమేష్‌ను సర్పవరం సబ్ రిజిస్ట్రార్‌గా డిప్యూటేషన్ బదిలీ చేశారు. ఇటీవల సర్పవరం సబ్ రిజిస్ట్రార్ వీవీఎల్ నరసింహారావు ఒక ఆస్తి విలువ పెంపు వివాదంలో సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ కె.వెంకటేష్ ఇప్పటి వరకు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. తాజాగా రమేష్‌ను డిప్యూటేషన్‌పై సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు.

ఉపాధ్యాయినికి ఘన సత్కారం

కాకినాడ: ముస్లిం విద్యార్థులకు 40 ఏళ్లుగా ఉర్దూ, అరబిక్ భాషలు నేర్పిస్తూ సేవలందించి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన వస్తాద్బి తహేరాను మంగళవారం ఘనంగా సత్కరించారు. స్థానిక సీరత్ కమిటీ భవనంలో కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ ఆలీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాన్‌మెరైన్ సంస్థ అధినేత ఆలీషా, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్ ఆమెను సత్కరించారు. అక్బర్‌షా, హజరత్, ఎజాజుద్దీన్, ఎస్‌కె దుర్రానీ, వలీబాషా, ఖాలీద్, బాబ్జీ, బహదూర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు విలువ పెంచేలా

- చురుగ్గా ఓటరు జాబితాలో సవరణలు
- రాజకీయ పార్టీల సహకారంతో సర్వే
- ఈ నెల 28 నాటికి తుది జాబితా సిద్ధం

కాకినాడ సిటీ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఓటర్ల సవరణ మరింత కచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. కచ్చితమైన ఓటరు తన ఓటు హక్కు వినియోగించుకునేలా, అతని ఓటుకు నిఖార్సైన విలువ ఏర్పడేలా అధికారులు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా బూత్ లెవెల్ అధికారులు వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి మొబైల్ యాప్‌లో ఓటర్ల పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు.

విస్తృత అవగాహన

ఓటర్ల సవరణ ప్రక్రియపై జిల్లా యంత్రాంగం విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు కృతికా శుక్లా, ఇలక్కియలు రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల సవరణ ప్రక్రియలో సహకరించాలని వారు ప్రజలను కోరుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పాదర్శకమైన ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు పూర్తి సహకారం అందించాలన్నారు.

గడువులోగా..

ఓటరు జాబితా సవరణకు సంబంధించి ఇప్పటికే బీఎల్‌వోలకు శిక్షణ అందించారు. వీరికి బీఎల్‌వో ఓటరు యాప్ (వెర్షన్ 4.7) అందజేశారు. కొత్త ఓటు నమోదు, పాతవి తొలగించడం, యాప్‌లోనే చేయాల్సి ఉంటుంది. కొత్తగా ఓటు హక్కు పొందాల్సిన వారు దరఖాస్తు నింపి బీఎల్‌వోలకు అందించాల్సి ఉంటుంది. ఈనెల 21 నుంచి మొదలైన ఓటర్ల సవరణ కార్యక్రమం ఆగస్టు 21 వరకు పరిశీలించి పూర్తి చేస్తారు. ఒకే కుటుంబంలో ఉన్న ఓటర్లందరినీ ఒకే పోలింగ్ స్టేషన్ అనుసంధానం చేసేందుకు ఇంటింటా సర్వే ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. వెరిఫికేషన్ అనంతరం ఆగస్టు 28 నాటికి పారదర్శకమైన, స్పష్టమైన ఓటర్ల జాబితా సిద్ధమవుతుంది.

కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ఓటర్లు ఇలా..

కాకినాడ సిటీ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,52,102 ఉండగా, పురుషులు 1,21,228, మహిళలు 1,30,735, ఇతరులు 139 మంది ఉన్నారు. అలాగే కాకినాడ రూరల్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,54,841 ఉండగా, పురుషులు 1,27,078, మహిళలు 1,27,782, ఇతరులు 21 మంది ఉన్నారు.



ఇంటింటా ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ (ఫైల్)

> **ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించాలి**
>
> ఇంటింటా సర్వేను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి. బీఎల్వోలు మీ ఇంటికి వచ్చినప్పుడు ఓటరు ఐడీ కార్డులు, పేరు చిరునామా, వయస్సు, ఆధార్, ఇతర వివరాలు సరి చేసుకోవాలి. ఫొటో చక్కగా లేకపోతే అక్కడికక్కడే ఫొటోను అప్‌డేట్ చేసుకోవాలి. పారదర్శక జాబితా పొందేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో సహకరించాలి.
>
> – డి.శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌ఓ, కాకినాడ జిల్లా



అభివృద్ధికి ఆదేశాలు ఇవ్వండి

సీఎం జగన్‌కు ఎంపీ గీత వినతి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన ఎంపీ గీత

కాకినాడ: పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతులు, ఆదేశాలు ఇవ్వాలని ఎంపీ వంగా గీత సీఎం జగన్‌ను కోరారు. మంగళవారం ఆమె రాజమహేంద్రవరంలో ఆయనను కలసి పలు అంశాలను సీఎంకు వివరించారు. తుని రైల్వే టన్నెల్ అంచనాలు, గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని ఆమె కోరారు.

ఆన్‌లైన్ విక్రయాల్లో అప్రమత్తం

కరప: వస్తువులు, పొలాలు, ఇళ్లు వంటి స్థిరాస్తులు, వాహనాలను ఆన్‌లైన్ కొనుగోళ్లు, విక్రయాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్సై ఎస్.రామకృష్ణ సూచిస్తున్నారు. కొనుగోలుదారు, విక్రేత పరస్పరం సంప్రదింపులు జరిపి పూర్తిస్థాయిలో ఆ కొనుగోలు లేదా విక్రయాలపై నమ్మకం కుదిరాకే ఆ లావాదేవీ జరపాలని ఆయన సూచిస్తున్నారు. కరపకు చెందిన ఒక వ్యక్తి గత ఏడాది ఒక మొబైల్ ఫోన్‌ను ఆన్‌లైన్‌లో మధ్యవర్తిత్వ మార్కెటింగ్ సైట్‌లో కొనుగోలు చేశారు. కాగా సదరు ఫోన్ చోరీకి గురైనట్టు కాకినాడలో కేసు నమోదైంది. ఐఎంఈఐ నంబరు ద్వారా లొకేషన్ గుర్తించి కరపలో దానిని వినియోగిస్తున్నట్టు తెలుసుకున్నారు. ఆ మేరకు గత ఏడాది ఆ ఫోన్‌ను కొనుగోలు చేసిన వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించి దానిని స్వాధీనం చేసుకున్నారు. క్రయ, విక్రయాల్లో పూర్తి అవగాహనతో వ్యవహరించకపోతే నష్టపోతారని, ఇటీవలి కాలంలో 90 మొబైల్స్ వరకు ఇలా రికవరీ చేసినట్టు ఎస్సై తెలిపారు.

వచ్చే నెలలో 'విన్నాం–చూశాం–చేశాం'

- ప్రతి ఇంటికీ వెళ్లి చేసిన పనులు వివరిస్తాం
- గడపగడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి వెల్లడి

కాకినాడ: గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను స్వయంగా చూసి వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను వివరించేందుకు 'విన్నాం–చూశాం–చేశాం' పేరుతో ప్రజల్లోకి వెళ్తామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు విన్నామని, కష్టాలను స్వయంగా చూసి ప్రతి ఒక్క అంశాన్ని పరిష్కరించామని ఎమ్మెల్యే చెప్పారు. సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక 43వ డివిజన్ ట్రెజరీకాలనీలో మంగళవారం ఆయన గడపగడపకూ వెళ్లి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. మరో 14 డివిజన్లలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించాల్సి ఉందని, ఆగస్టు చివరి నాటికి ఈ మొత్తం డివిజన్లలో పూర్తి చేస్తామని చెప్పారు.



గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

విద్యుత్ దీపాల సమస్యకు పరిష్కారం

నగరంలోని విద్యుత్ దీపాల సమస్యకు రెండు మూడు వారాల్లో పూర్తిస్థాయి పరిష్కారం చూపిస్తామన్నారు. 20 వాట్స్ లైట్లు 500, 60, 80 వాట్ల బల్బులు వందేసి చొప్పున 700 లైట్లను సిద్ధం చేస్తున్నామన్నారు. టెండర్లు పిలచి లైట్లు వెలగని చోట ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో ఉన్నామని, ప్రజలు తమను ఆశీర్వదించాలని కోరారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు జేడీ పవన్‌కుమార్, వాసంశెట్టి కృష్ణతులసి పాల్గొన్నారు.

బాధితురాలికి సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

స్థానిక 27వ డివిజన్ తిలక్‌వీధి ప్రాంతానికి చెందిన సబ్బెళ్ల ఆదిలక్ష్మికి రూ.4 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మంగళవారం అందజేశారు. ఇటీవల కిడ్నీ మార్పిడి చికిత్స చేయించుకున్న ఆమె ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే ద్వారంపూడి వివరించగా ఆయన ఈ నిధులు విడుదల చేశారు. ఆదిలక్ష్మి భర్త పెద్దిరెడ్డి ఎమ్మెల్యేకు ధన్యవాదాలు చెప్పారు.

నేడు ఆవుల సుబ్బారావు యాదవ కమ్యూనిటీ హాల్ ప్రారంభం

కాకినాడ: యాదవుల కోసం గాంధీనగర్ గొల్లపేటలో చక్కని వసతులతో కమ్యూనిటీహాలు రూపుదిద్దుకుంది. రూ.12.5 లక్షల నగరపాలక సంస్థ సాధారణ నిధులతో ఈ సామాజిక భవనాన్ని నిర్మించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చొరవతో వేగంగా నిర్మాణాన్ని పూర్తి చేశారు. బుధవారం ఉదయం ఎమ్మెల్యే ద్వారంపూడి ఈ భవనాన్ని ప్రారంభించనున్నారు. ఆవుల సుబ్బారావు యాదవ కమ్యూనిటీ హాలుగా దీనికి నామకరణం చేశారు. జిల్లాలోనే తొలిసారిగా యాదవ సామాజిక వర్గానికి ప్రయోజనం కలిగేలా దీని నిర్మాణానికి ఎమ్మెల్యే సహకరించారని స్మార్ట్‌సిటీ మాజీ చైర్మన్, కాకినాడ పార్లమెంటరీ జిల్లా వైఎస్సార్ సీపీ బీసీసెల్ అధ్యక్షుడు అల్లి రాజబాబు, అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి మన్నే నాగేశ్వరరావు, సంఘ గౌరవాధ్యక్షుడు నొడగల బాబురావు, నంబారి రమణయాదవ్ సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నవరత్నాలు

- ఎమ్మెల్యే కన్నబాబు
- గొర్రిపూడిలో గడప గడపకూ

కరప: ప్రతి కుటుంబానికి ప్రయోజనం కలిగించి, తద్వారా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని చెప్పేందుకే సీఎం జగన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం గొర్రిపూడి–1 సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు చీకాల అప్పలరాజు, ఎర్రంనీడి సుబ్రహ్మణ్యం, కానూరి శ్రీహరి, ఊబా కిశోర్, జల్దాని ఏసుగంగాధర్, పుణ్యమంతుల తాతాజీ తదితరులతో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులు అందుకుంటున్న ప్రభుత్వ పథకాలను వివరించారు. అర్హత ఉండి ఎవరికైనా ఏ పథకం రాకపోయినా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామంలోని కొన్ని వీధుల్లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని ప్రజలు కోరారని, త్వరలోనే వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని అన్నారు. కొందరు ఇంటి స్థలం రాలేదని తెలుపగా, రెండో విడతలో పట్టాలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంపీడీఓ కె.అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, వాసంశెట్టి శ్రీనుబాబు, కె.కామేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.



గొర్రిపూడిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

శతశాతం లక్ష్యాలు సాధించాం

- ఒకే ఏడాదిలో రెండు స్వర్ణ పతకాలు కైవసం
- రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఒక సంవత్సరంలో రెండు సార్లు స్వర్ణ పతకం సాధించిన ఘనత మన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కాకినాడ జిల్లా బ్రాంచ్‌కు దక్కిందని సొసైటీ జిల్లా బ్రాంచ్ అధ్యక్షురాలు, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ఏడాది నిర్ణయించిన లక్ష్యాలను నూరుశాతం సాధించామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఐ బ్యాంకుకు చాలా డిమాండ్ ఉందని, రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా జిల్లాలోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సహకారంతో ఒక ఐ బ్యాంకును ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు రూ. 45 లక్షలు కేటాయించినట్టు తెలిపారు. జిల్లాలో మోడల్ చైల్డ్ కేర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను రూ.1.30 కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోస్తాలోని ఏడు మండలాల్లోని యువతకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బ్లడ్ బ్యాంక్ క్వాలిటీ ఇంప్రూవ్ చేయడానికి అక్రిడిటేషన్ పొందడానికి ప్రయత్నం జరుగుతుందన్నారు. పెద్దాపురం డివిజన్‌కు ప్రత్యేక రెడ్‌క్రాస్ బ్రాంచ్ ఏర్పాటు చేసి దాని ద్వారా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సంవత్సరం కూడా అవార్డులు వచ్చేలా సామాజిక సేవలు చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. యువతను ఎక్కువగా సభ్యులుగా చేర్చుకోవాలని అన్నారు. రెడ్‌క్రాస్ సంస్థకు నిధులు సమకూర్చిన సంస్థలు ఓఎన్‌జీసీ, దేవి ఫిషరీస్, కాకినాడ సీపోర్టు ప్రతినిధులను కలెక్టర్ కృతికా శుక్లా సత్కరించారు. కాకినాడ జిల్లా బ్రాంచ్ చైర్మన్ వైడీ రామారావు సంస్థ ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. గత సంవత్సరం బడ్జెట్ ఖర్చు చేసిన నిధులు ఆమోదం, ఈ సంవత్సరానికి అంచనాలు రూపొందించి వాటిని సభ్యులతో ఆమోదింపచేయడం జరిగిందన్నారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ బాలకృష్ణ, కార్యదర్శి శివకుమార్, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో వివిధ సంస్థల ప్రతినిధులను సత్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

వ్యక్తిపై నలుగురి దౌర్జన్యం

కరప: రాత్రి వేళ ఇక్కడ ఏంచేస్తున్నారని ప్రశ్నించినందుకు ఒకవ్యక్తిపై నలుగురు దౌర్జన్యం చేసి, పరారయ్యారు. పోలీసుల కథనం మేరకు మండలం పెనుగుదురులోని దేవుడు కాలనీకి చెందిన నులికుర్తి మధుసూదనరావు సోమవారం రాత్రి ఇంటికి వెళుతుండగా ఒక ప్రైవేటు ఫిజియోథెరపీ కళాశాల సమీపంలో రోడ్డుపక్కన మోటార్ బైక్‌పై స్త్రీ, పురుషులు ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు. ఇంతరాత్రి సమయంలో రోడ్డుపై ఏంచేస్తున్నారని మహిళను మధుసూదనరావు ప్రశ్నించాడు. దీంతో ఆ వ్యక్తి మధుసూదనరావుపై దౌర్జన్యానికి దిగాడు. ఇంతలో పక్కనున్న స్త్రీ ఎవరికో ఫోన్ చేయగా మరో ఇద్దరు యువకులు వచ్చి ఆ దాడిలో పాలుపంచుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

ప్లాస్టిక్ క్యారీబాగ్‌లకు దూరం

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లకు వ్యాపారులంతా దూరంగా ఉండాలని ది గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పెద్ది రత్నాజీ కోరారు. స్థానిక ఆర్ఎల్ గ్రాండ్‌లో మంగళవారం ది కాకినాడ పోలిథిన్ మర్చంట్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘ అధ్యక్షుడిగా ఎం.రామకృష్ణ, కార్యదర్శిగా జె.గోపాలకృష్ణ, కోశాధికారి పి.సుమంత్, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా

ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం చేయకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టినట్లు ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, పోలీస్, లీగల్, స్త్రీ శిశు సంక్షేమ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడ శిశువుల పట్ల వివక్షతో జరిగే భ్రూణహత్యలను నివారించడంతో పాటు గర్భస్థ పిండ లింగనిర్ధారణ చట్టం అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని, చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్లు మొత్తం 104 ఉన్నాయని, దీనిలో 10 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నాయన్నారు. గత ఏప్రిల్ నుంచి జులై వరకు 24 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 79 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు చేసినట్టు తెలిపారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలోనూ పీసీ, పీఎన్డీటీ చట్టానికి సంబంధించి బోర్డులను, వాల్ పోస్టర్లను ప్రదర్శించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐ.ప్రభాకర్, జి.రాము, ఎం.కీర్తిప్రియ, ఎన్‌జీవో ప్రతినిధులు కె.సింహాద్రి, పి.సత్యవతి, ఎస్.కృష్ణారావు, ఎల్.శృతి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల సర్వే

కాకినాడ: నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల సర్వేపై సమావేశం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ సీతాపతిరావు మాట్లాడుతూ ఓటర్ల సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు బిఎల్‌వోలు సహకరించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రతినిధి రావూరి వెంకటేశ్వరరావు, టీడీపీ, బీజేపీ నేతలు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంఎస్‌వో మురళీకృష్ణ, డీసీపీ రాంబాబు, ఏసీపీ నాగశాస్త్రులు పాల్గొన్నారు.

13న వీణా కచేరి

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో సంగీత స్రవంతి ఆధ్వర్యంలో 13వ తేదీ ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు వీణా కచేరీ నిర్వహించనున్నట్టు స్రవంతి నిర్వాహకురాలు, సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి తెలిపారు. ప్రముఖ వీణా విద్వాంసులు ద్విభాష్యం నగేష్ బాబు వాగ్గేయకారుల కీర్తనలు వీణపై పలికిస్తారని తెలిపారు.

క్లినికల్ ల్యాబ్‌కు రూ.3 లక్షలు విరాళం

బాలాజీచెరువు: బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌కు మంగళవారం బాలకృష్ణ తనయుడు రాధేశ్యామ్, కృతి దంపతులు రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ చిట్నీడి శ్రీనివాసరావుకు ట్రస్ట్ కార్యాలయంలో శ్యామ్ దంపతులు అందజేశారు. జూలై 16వ తేదీ నుంచి ల్యాబ్ అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ బాదం బాలకృష్ణ, కుసుమ, కార్యదర్శి రమణామూర్తి, జోన్ వైస్ చైర్మన్ మట్టపల్లి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



క్లినికల్ ల్యాబ్‌కు విరాళం అందజేస్తున్న బాదం రాధేశ్యామ్ కృతి దంపతులు

సరైన ప్రణాళికతో సివిల్స్‌లో రాణింపు

కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

కాకినాడ: కృషి, పట్టుదల, సరైన ప్రణాళిక ఉంటే సివిల్స్‌లో రాణించడం కష్టం కాదని రాష్ట్ర కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. పేదరికం నుంచి ఎంతో మంది సివిల్స్‌లో రాణించడమే ఇందుకు నిదర్శనమన్నారు. స్థానిక అన్నవరం సత్యదేవి మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన అవేర్‌నెస్ ఆన్ సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్‌లో ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సానుకూల దృక్పథంతో పాటు అవసరమైన పుస్తకాలను అధ్యయనం చేయడం, సీనియర్ల అభిప్రాయాలను పంచుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల జీవితాలు ఎలా నాశనం అవుతున్నాయో వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నషాముక్త్ భారత్' గురించి వివరించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ కో–ఆర్డినేటర్ పావని గణపతిరాజు పర్యవేక్షణలో జరిగిన ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనంతలక్ష్మి, ఐక్యూ కో–ఆర్డినేటర్ వసంతలక్ష్మి, ఫిజిక్స్ లెక్చరర్లు సూర్యదేవర, కస్టమ్స్ సూపరిటెండెంట్లు సతీష్ సింగ్, శివకుమార్, ఇన్స్‌పెక్టర్ బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

25న చలో విజయవాడ

కాకినాడ సిటీ: వీఆర్ఏలను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈనెల 25న జరిగే చలో విజయవాడకు జిల్లాలోని వీఆర్ఏలు తరలివెళ్లి జయప్రదం చేయాలని ఆ సంఘం పిలుపునిచ్చింది. కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్ష శిబిరం మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఈ శిబిరాన్ని సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి ప్రారంభించగా శిబిరంలో సంఘం నాయకులు నిడమర్తి సురేష్, ఇజ్రాయిల్, రాజు, తాతారావు, నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు చెక్కల రాజ్‌కుమార్, చంద్రమళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు ఎంపీ గీత అభినందన



జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ఎంపీ గీత

కాకినాడ రూరల్: ఢిల్లీలో జాతీయ స్థాయిలో జరిగే క్రీడలకు ఎంపికైన కాకినాడ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులను ఎంపీ వంగా గీత అభినందించారు. జాతీయ స్థాయి పోటీలలో సత్తా చాటాలన్నారు. వలసపాకల పాఠశాలలో చదువుతున్న వారు హైదరాబాద్‌లో జరిగిన హాకీ, బ్యాడ్మింటన్, చెస్, బాక్సింగ్, స్కేటింగ్ పోటీలలో ప్రతిభ చూపి ఢిల్లీలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ బి.శేఖర్, పీఈటీ టి.అశోక్‌కుమార్ ఎంపీ గీతకు పరిచయం చేశారు. కాకినాడకు పేరొచ్చేలా ఆటలు ఆడాలని ఆమె విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో వంగా విశ్వనాథ్, రావుల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఏకాగ్రత వృద్ధి

నాగమల్లితోట జంక్షన్: ధ్యానం ఏకాగ్రతను పెంచుతుందని ప్రణవ ఆశ్రమ నిర్వాహకులు సుమిత్రానంద సరస్వతీ మాతాజీ అన్నారు. స్థానిక రామారావుపేటలోని నారాయణ పాఠశాలలో మంగళవారం మాతాజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాతాజీని పాఠశాల తరఫున దుశ్శాలువా కప్పి, పండ్ల బొకేతో సత్కరించారు. నారాయణ పాఠశాలల ఏజీఎం కె.రాఘవేంద్రరావు, స్టేట్ కో–ఆర్డినేటర్ సుంకరమూర్తి, జోనల్ కో–ఆర్డినేటర్ రామతులసి, పాఠశాల ప్రిన్సిపాల్ షర్మిల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.